

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 46 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'జయ జయ నవ నరసింహాశరీరా
జయ రక్షోవిభు వక్షవిదారా'

అంటూ తూర్పుకనుమలలో చిరపరిచితమైన కంఠం వినిపించింది. సింహాచలం గుహలలో, పర్వతశిఖరానికి తాకి ఆ మధురమైన కంఠం గంభీరంగా మారుమ్రోగింది. గాలి వాలున ఆ గాన తరంగాలు వినిపించాయేమో ఆనందం పట్టలేనట్లు ఎగిసిపడుతూ పదిమైళ్ళ రంనుండి కనిపిస్తున్నది తూర్పుసముద్రం. పంచమంలో శృతి పడుతున్నట్లు సముద్రఘోష తీరమంతా వినిపిస్తున్నది. ఆ గొంతు ధ్వనించడం మొదలు కాగానే యాత్రికులు నెమ్మదిగా ఆ గాయకుడిచుట్టూ మూగడం మొదలుపెట్టారు. వరాహనరసింహుని గుడి గంటలు, చిరుగాలులకు కదులుతున్న ధ్వజస్తంభపు గంటలు జోడువాయిద్యాలలా మధురంగా మ్రోగుతున్నాయి.

విరక్తితో రతీదేవిని, వసంతుడిని వదిలిపెట్టి వచ్చిన మన్మథుడిలా వున్నాడా గాయకుడు. వసంతంమీద రోతపుట్టి గ్రీష్మంలో కన్నులపండుగ చేస్తున్న కంతుడిలా వున్నాడు. రాబోయే వర్ష ఋతువు సూచనలు మధ్య మధ్య ముసురుతున్న మబ్బులలో కనిపిస్తున్నాయి. అది ఆషాఢ శుద్ధ

ద్వాదశి. క్రితం రోజు శయనేకాదశి. సింహాచల వరాహనరసింహుడి శయనోత్సవం దివ్యంగా దర్శించుకుని స్వామి సన్నిధిలో నిదురించిన భక్తులు మైమరచి ఆ గానం వింటున్నారు.

పద్దెనిమిది సంవత్సరాల యువకుడు ఆ గాయకుడు. పసిమివన్నెలో మిసమిసలాడుతున్నాడు. తారస్థాయిలో గానం చేస్తుంటే కంఠంమీద ఉబ్బిన నరాలు అందంగా కనిపిస్తున్నాయి. ప్రపంచాన్ని మైమరచి గర్భగుడిలోని నరసింహుడికోసమే గానం చేస్తున్నట్లు స్వామి మూర్తి మీదే దృష్టి, మనసు లగ్నం చేసి గానకైంకర్యం చేస్తున్నాడు. ఎడమచేతిలో తంబుర, కుడి చేతిలో చిడతలు కంఠంనుండి పొంగిపొరలుతున్న గానగంగాప్రవాహంతో కలిసి

సామగాన త్రివేణీసంగమస్నానం చేయిస్తున్నాయి శ్రోతలను. చెరుకువింటిని, పూల బాణాలను పక్కన పారేసి, తంబురను, చిడతలను పట్టుకున్న మన్మథుడిలా వున్నాడు ఆ యువకుడు.

పర్వతపాదంలో విడిచిన గుఱ్ఱాల సకిలింపులు మధ్యమధ్య గాలివాటుకు వినిపిస్తున్నాయి. వాటికి వంత పాడుతున్నట్లుగా మదగజాల ఘీంకారాలు వినిపిస్తున్నాయి. కాకతీయ, కళింగ, కొంకణ, ద్రావిడ, మైసూరు పాలకులు స్వామికి పంపిన కానుకలను తీసుకువచ్చిన అధికారుల వాహనాలు అవి.

వందలసంఖ్యలో వున్న శ్రోతలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మరిచిపోయినట్లు వింటున్నారు. పిల్లలు, అన్ని వయసుల మహిళలు, పురుషులు, వృద్ధులు ఆ గానవాహినిలో ఓలలాడుతున్నారు. ప్రహ్లాదుడు కట్టించాడని పేరుమోసిన ఉత్సవ మంటపం మీద మైమరచి గానం చేస్తున్నాడు. తోడుగా, లయబద్ధంగా చిరుచిందులు వేస్తున్నాడు. రాతి తోరణాలతో, అందమైన శిల్పాలతో మనోహరంగా వున్న మంటపంలో నర్తిస్తున్న శిల్పంలా వున్నాడు ఆ యువకుడు.

మూడుజతల కన్నులు మినహా మిగిలిన కనులు అన్నీ ఆనందపారవశ్యంతో మూతలు పడినట్లున్నాయి. వాటిలో రెండు జతల కన్నులు ద్వేషంతో, అసూయతో రగిలిపోతున్నట్లు ఎఱ్ఱబడ్డాయి. ఆ రెండుజతల కన్నులు ఆలయ అర్చకబృందంలోని యువకులవి. ఊర్ధ్వ పుండ్రాలు, శిఖలు, ఉత్తరీయాలు, మెడలలో తామరపూసల మాలలు వారికి అసహజంగా, ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. నడుముకు బిగించి కట్టిన దట్టీని విప్పి, విదిలించి విసురుగా వెనుకకు తిరిగి వెళ్ళబోయాడు వారిలో ఒకయువకుడు. చేయి పట్టుకుని బలవంతంగా అతడిని ఆపివేశాడు రెండవ యువకుడు. 'నీకెందుకు! కొద్దిగా ఓపిక పట్టు' అన్నట్లుగా సంజ్ఞ చేసి మూడవజత కన్నుల ముగ్ధమోహన రూపాన్ని చూపించి కనుబొమలెగరేశాడు.

ఆమె రెండుకన్నులు గండుచేపల్లా మిలమిలలాడుతున్నాయి. ఆ రెండుకన్నుల మధ్యన సన్నని ముక్కు తిన్నని గాలంలా వుంది. గడుసుగా వుంది. ఆ క్రింద కొద్దిగా మైకంగా, కొద్దిగా కోరికతో అరతెరుచుకున్న ఎఱ్ఱని పెదాలు రెండు ఎరలలా వున్నాయి. ఆ కనులు ఆల్చిప్పల్లా వున్నాయి. పెదాలు అమృతపు చిప్పల్లా వున్నాయి. ఆ క్రింద అందమైన చుబుకం యింకా అందమైన ముద్దైన నొక్కుతో తలకట్టు లేని 'ద'కారంలా వుంది. దర్పంగా వుంది. ఆ రూపం అమృతాన్ని పంచడానికొచ్చిన మోహిని ఆకారంలా వుంది. ఒకటి కాదు, అమృతభాండాలు రెండు అన్నట్లు పొగరైన వక్షస్థలం వున్నది. పర్వతపాదంలో మైదాన ప్రదేశంలా ముద్దైన పొత్తికడుపు గాలివాలుకు పవిటతొలిగినపుడు కనువిందు చేస్తున్నది. పెద్ద ముద్దమందారం నడిమిలా నాభి వున్నది. రవికకున్న జలతారు చమ్కీ దండ ఆ నాభిమీద కితకితల కేసరంలా వున్నది! సముద్రపు నురగలాంటి తెల్లని చీర, రవిక లోపలి శరీరపు బంగారురంగు కాంతులను పైకి విరజిమ్ముతున్నాయి.

ఆ అందం మన్మథుడు పురుషులను పణంగా పెడితే రతీదేవి కాసిన పందెంలా వున్నది. గెలవాలని కసిగా వేసిన పాచికలా వున్నది. ఆ పాచికకు పదహారేళ్ళ వయసు. ఆ మోహనరూపం పేరు మోహనాంగి. ఆమె రత్నాంగి ముద్దుల పట్టి. రత్నాంగి చోళరాజుల సామంతరాజు ఉంపుడుగత్తె. యాత్రికులు సేదదీరడానికి మహారాజు ఎవరో కట్టించిన బ్రహ్మాండమైన శిలామంటపం వెనుక వున్న పున్నాగచెట్టును ఆనుకుని ఆ అమృత గానాన్నివింటున్నది మోహనాంగి. ఆమె క్రీగంటి చూపుల బిచ్చగాళ్ళు ఆ అర్చక యువకులు యిద్దరూ.

మంటపం నిండా కూర్చుని వున్నారు యాత్రికులు. ఎవరూ వేరే ఎవరినీ పట్టించుకోవడం లేదు. అందరి చూపులూ మంటపంలోని మన్మథుడి మీదే. అందరి చెవులూ అతడి గానం మీదే.

జయ దైత్యేభసమూహ వినాశా
జయ ఘన రిపుజన రుధిర పిపాసా
జయ దానవజనవిపిన కుఠారా
జయ జయ దనుజనికాయ కఠోరా

.. అంటూ గానవీచికలు ఎగసి పడుతూనే వున్నాయి. అందమైన ఆల్చిప్పల కన్నులు రెండు మత్తుగా బరువెక్కాయి. అమృతపు చిప్పల పెదాలు ముద్దుగా వంకర తిరిగాయి. మదరపండిన నారింజతొనలా వున్న క్రిందిపెదవిని పంటనొక్కుతూ 'ఊ..చెప్పండి! మీకోసం కాకున్నా నాకోసమన్నా వీడిని మరిగించుకోవాలి! ఏమందం! ఎక్కడివాడో ఎవరో కానీ, యిన్నాళ్ళూ నా కంట పడలేదేందుకో' అన్నది ఆమె. ఆ అందమైన శరీరం సన్నగా కంపించింది.

చెక్కిళ్ళమీద, మెడమీద, అందమైన ఉదరం మీద పులకలు రేగాయి. మచ్చికైన యజమాని చేతితో నిమురుతుంటే మైనా కంఠంలా మత్తుగా ధ్వనించింది గొంతు.

'ఎక్కడివాడో తెలియని అనామకుడు. కొన్నేళ్ళ క్రితం వరకూ రెండు కనులూ కనిపించని పుట్టు గ్రుడ్డి. ఎవరో బైరాగి ఎక్కడినుండో వీడిని గుదిబండలా మా నెత్తిన పెట్టి పోయాడు' అన్నాడు ఒక యువకుడు. అతడిపేరు అప్పయ్య శాస్త్రులు.

'వీడివలన స్థానాచార్యులకు, అర్చకులకు విలువే లేకుండా పోయింది. సింహాచలం అంటే వీడు, వీడి ప్రేలాపనలు అనుకుంటున్నారు జనులు. అప్పన్నను చూడడానికి, వీడి పదాలు, పాటలు వినడానికే వస్తున్నారట, భక్తులే చెప్పుకుంటున్నారు' అన్నాడు రెండవ యువకుడు. కుతలాడుతున్న అగ్నిపర్వతంలా వున్నాడతను. అతడి పేరు వరాహశాస్త్రి.

'రెండు కనులూ కనిపించని పుట్టు గ్రుడ్డివాడా?! అతడికి చూపు ఎలా వచ్చింది మరి?' అసలే పెద్ద కళ్ళను యింకా పెద్దగా చేస్తూ ఆశ్చర్యంగా అడిగింది మోహనాంగి. మంటపంలోని మన్మథుడిమీద చూపులు మళ్ళీ నిలిపింది. 'ఓహ్!' అని సంభ్రమంగా చిన్న కేక పెట్టింది. చప్పున జింకపిల్లలా గంతులేస్తున్నట్లు మంటపం వైపు నడిచింది. నృత్యం చేస్తున్న వూపుకు, వీస్తున్న గాలులకు ఆ గాయకుడి చాతీని చుట్టి భుజం మీదుగా కప్పుకున్న ఉత్తరీయం తొలిగిపోయింది. అతడి విశాలమైన వక్షస్థలం మీద పచ్చ పొడిచినట్లు నల్లగా నిగనిగలాడుతున్న చిహ్నాన్ని అబ్బురంగా చూడసాగింది.

జయ విధ్వస్త సమస్త విరోధి
నిరస్త మహాసుర, ఈశ! ప్రశస్తా!
జయ జయ ఖేలన! సుత జన పాలన!
జయ ఘనరంహా! జయ నరసింహా!

..అని చివరి చరణాన్ని ముగించాడు గాయక మన్మథుడు! రాగాలాపనలో మునిగిపోయాడు. జయ జయ ధ్వానాలతో మైమరచి అడుగులు తొక్కుతున్నాడు. ఉత్తరీయం జారిపోయింది అన్న స్పృహ లేనట్టుంది అతడికి. తమకు తెలియకుండానే జయ జయ ధ్వానాలు చేస్తూ అంతకంతకూ ముందుకు ముందుకు అడుగులు వేస్తూ మంటపం చుట్టూ గుమికూడారు అందరూ. ఎత్తైన మెట్లను చెంగున దూకుతూ ఎక్కింది మోహనాంగి. మంటపంలో క్రిందపడిన ఉత్తరీయాన్ని తీసుకుంది. రెప్పకొట్టకుండా అతడినే చూడసాగింది. ఆ సముద్రతీర పట్టణంలో యింతవరకూ ఆమెను రెప్పవాల్చకుండా చూసినవాళ్ళే మగాళ్ళు అందరూ. ఒక మగాడిని ఆమె రెప్పవాల్చకుండా చూడడం అదే మొదలు.

ఆ నల్లని పెద్ద కన్నులను, నుదుటిమీదకు పడుతున్న మెలితిరిగిన ముంగురులను ఆనందంగా చూసింది. ఆ ఎఱ్ఱని పెదాలను ఆశగా చూసింది. విశాలమైన ఆ వక్షస్థలాన్ని ఆబగా చూసింది. అంతే! పదే పదే అతడి చాతీని విస్మయంగా చూడసాగింది. బొడ్డును చుట్టుకుని, చాతీ మధ్యవరకూ పైకి లేచి, పడగవిప్పిన త్రాచు బొమ్మ అది. శ్రద్ధగా నేర్పుగా పచ్చ పొడిచినట్లు వున్నది. అతడి ఉత్తరీయాన్ని పట్టుకుని రెండు చేతులూ సాచింది మోహనాంగి, అందించడానికో, కప్పడానికో! అంత దగ్గరగా ఏ స్త్రీనీ అదివరకు చూడలేదు అతడు. అంత అందమైన స్త్రీని అసలే చూడలేదు. లిప్తపాటు సంభ్రమంగా, సమ్మోహనంగా చూశాడు. తనవైపు సాచిన చేతులను గమనించి 'అర' అడుగు వెనక్కు వేయబోయాడు.

ఆ మంటపంలో పరచిన శిలమీద మధ్యలో బ్రహ్మాండమైన పద్మం నల్లరాతితో చెక్కి వుంది. అంచు పైకి లేచిన నున్నని ఆ పద్మం రేకు మీద మోహనాంగి పాదం పడ్డది. ఆ నునుపుకు ఆ పాదం జారింది. చేతులు సాచి ముందుకు మొగ్గింది మొగ్గినట్లుగా ఆ గాయక మన్మథుడి మీదకు వాలిపోయింది. వెనుకకు అడుగు వేయబోతున్న వాడు ఆమె తనమీద పడడంతోఆ వూపుకు ఆమెతోపాటు వెనక్కు వాలిపోయాడు. చుట్టూ మూగిన జనులు ఉత్సాహంగా, సంభ్రమంగా, చిలిపిగా హర్షధ్వానాలు చేశారు ఎందుకో!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS